క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హైకోర్టు కాలనీ, ఆటోనగర్ పారిశ్రామికవాడ, డీర్‌పార్కు పరిధిలోని ప్రాంతాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, అందరూ సహకరించాలని ఆయన కోరారు.

శివాలయ భజన మండలి కమిటీ ఎన్నిక

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలోని శ్రీ శివాలయ భజన మండలి నూతన కమిటీని సోమవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కటికపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా సొప్పరి శేఖర్, కుర్వమోని రమేశ్, ప్రధాన కార్యదర్శిగా మణికంఠ, క్యాషియర్‌గా ఉప్పునూతల శివకుమార్‌తో పాటు మరి కొంతమంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయాన్ని శుద్ధి చేస్తున్న అర్చకులు

తుక్కుగూడ: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మూసిన మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ, జెన్నాయిగూడ శ్రీలక్ష్మీనర్సింహాస్వామి, శ్రీనగర్ శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాలను సోమవారం అర్చకులు సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలో ఉన్న దేవతామూర్తులకు అభిషేకం, అలంకరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీలు ఐక్యత చాటాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: తెలుగు రాష్ట్రాల ఎంపీలు విపక్షాల కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి ఓటు వేసి తమ ఐక్యతను చాటాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం పుర కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కారన్నారు. దేశంలో అభివృద్ధి, సమగ్ర సంక్షేమం కోసం కృషి చేస్తున్న విపక్షాల అభ్యర్థికి ఎంపీలు ఓటు వేయాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో గణేశ్ నిమజ్జన కార్యక్రమం విజయవంతం చేసినందుకుగాను పోలీస్, వివిధ శాఖల సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంవీఎస్ఆర్‌లో ఒరియంటేషన్ డే

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం ఒరియంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏర్‌సీఐ సైంటిస్ట్ డా.ప్రమోద్ హెచ్ బోర్సే, ముఖ్యులుగా కళాశాల చైర్మన్ పీవీఆర్ కశ్యప్, కార్యదర్శి డా.కేపీ శ్రీనివాస్‌రావు, కోశాధికారి సుధాకర్ జుపుడి, జాయింట్ సెక్రటరీ సూర్యప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. ఆధునిక ఇంజనీరింగ్ రంగంలో అంతర్రాష్ట్ర విజ్ఞానం, పరిశోధనల ప్రాధాన్యత, సుస్థిర అభివృద్ధికి నూతన ఆవిష్కరణలు ఎంత ముఖ్యమో విద్యార్థులకు వివరించారు. సాంకేతిక నైపుణ్యాలను సామాజిక బాధ్యతతో కలిపి అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కామేశ్వర్‌రావు, సీపీ వర్ధని, ప్రసన్నకుమార్, కె.వేణుగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి మూడు అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణికి మూడు అర్జీలు వచ్చాయని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. భూ సమస్యలపై రెండు, ఉపాధిహామీ కూలీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఒక దరఖాస్తు వచ్చిందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులకు అర్జీలను పంపి, సమస్యల పరిష్కారానికి కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు.

పత్తికి తెగులు.. సస్యరక్షణే మేలు

- పత్తి పంటను వేధిస్తున్న తలమాడు తెగులు
- నివారణకు చర్యలు పాటిస్తే లాభం
- రైతులకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచన



మహేశ్వరంలో తెగులు సోకిన పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

మహేశ్వరం: ప్రస్తుతం పత్తి పంట పూత దశ నుంచి లేత కాయ ఏర్పడే దశలో ఉంది. కొన్ని చోట్ల తలమాడు తెగులు వ్యాప్తి చెందుతోంది. ఇది తామర పురుగు వాహకంగా పని చేస్తోంది. మండలంలో రైతులు వేసిన పత్తి పంట 80 నుంచి 100 రోజుల దశలో ఉంది. పంట దిగుబడిపై ప్రభావం చూపే ఆ తెగులు ఉధృతి క్రమంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇటువంటి తరుణంలో తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

తెగులు వ్యాప్తి ఇలా..

తలమాడు తెగులు తామర పురుగులు, వైరస్ సోకిన మొక్కల నుంచి ఇతర మొక్కలకు వ్యాపిస్తుంది. తామర పురుగు ఉధృత్తి గమనిస్తే తలమాడు తెగులు ఇతర ఆరోగ్యకరమైన మొక్కలకు వ్యాపిస్తాయి.

లక్షణాలు..

- లేత ఆకులు అంతాపైకి ముడుచుకొని ఆకుల మీద ఇటుక రంగు మచ్చలు ఏర్పడుతాయి.
- పత్తి ఆకులు ఆకుపచ్చ, పసుపు సమ్మేళనంగా మారతాయి.
- ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పత్తి మొక్కలోని ఆకుల అంచున ఇటుక రంగులోకి మారి పంట ఎదుగుదల లోపిస్తుంది.
- ఈ తెగులు ఆశించిన మొక్కలోని గూడ కూడా సరిగా వృద్ధి చెందదు. గూడ మాడిపోతుంది.
- ఎండకు ఆకుల అడుగు భాగం అంతా ఎరుపు రంగులోకి మారి ఆకులు మెరుస్తున్నట్లు కనబడుతాయి.
- యాజమాన్య పద్ధతులు తలమాడు వైరస్ తెగులు అనేది కలుపు మొక్కలైన పార్థీనియం(వయ్యారిభామ) పూతలో, ఉమ్మెత్త వంటి మొక్కల్లో వృద్ధి చెందుతుంది. పంట చుట్టూ కలుపు మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.

జాగ్రత్తలు..

పత్తి పంట బెట్ట పరిస్థితులకు గురైనప్పుడు ఒకసారి మల్టీ–కె(13–0–45) 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- ఎకరానికి 20 నీలి రంగు లేదా తెలుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి.
- ఉధృతి ఆర్థిక నష్ట పరిమితి స్థాయిని దాటినప్పుడు ఒకసారి థయోమిథాక్సమ్ 0.4 గ్రాములు లేదా ఫ్లోనికామైండ్ 0.3 గ్రాములు లేదా డైఫెన్‌థ్యురాన్ 1.25 గ్రాములు లేదా పిప్రోనిల్ 0.25 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ప్రస్తుతం పత్తి పంటలకు తలమాడు తెగులు వ్యాప్తి చెందుతుంది. రైతులు వెంటనే అప్రమత్తమై తెగులును గుర్తించి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలకు సమాచారం అందించాలి. వారు చెప్పిన విధంగా జాగ్రత్తలు పాటించి.. మందులు పిచికారీ చేస్తే తెగులును కొంతవరకు నివారించవచ్చు. పత్తి పంటలలో కలుపు లేకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలి. – నాగమణి, మండల వ్యవసాయాధికారి, మహేశ్వరం

- 80 రోజుల తర్వాత యూరియా వాడకం నిలిపివేయాలి.
- పత్తి పంట చుట్టూ కలుపు లేకుండా జాగ్రత్త పడాలి.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరిత

కందుకూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 51,706 మంది ఓటర్లు, 92 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. తప్పులను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు



డీలర్లతో మాట్లాడుతున్న ఏడీఏ సురేశ్‌బాబు

మొయినాబాద్: ఫర్టిలైజర్ షాపుల డీలర్లు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు అన్నారు. సోమవారం మొయినాబాద్ రైతు వేదికలో ఫర్టిలైజర్ షాపుల డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల విక్రయ ధరల్లో తేడా లేకుండా ఉండాలన్నారు. బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, యూరియా స్టాక్ ఎంట్రీని తప్పనిసరిగా ఈ–పాస్ యంత్రంలో నమోదు చేయాలని సూచించారు. రైతులు యూరియాను అధికంగా వాడొద్దని.. అది నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. రైతులు సాధారణ యూరియాకు బదులు నానో యూరియా వాడాలని సూచించారు. రైతులకు సరిపడా ఎరువులు అందిస్తున్నామని.. ఒకేసారి రైతులు రావడంతో ఇబ్బంది అవుతుందని.. టోకెన్లు ఇచ్చి అందజేస్తున్నామన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓలు సునీల్, కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

ఆలూరును మండలం చేయాలని వినతి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఆలూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు, అదేవిధంగా అలూరు బీటీ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ ఎస్ఈని గ్రామ బీజేపీ నాయకులు కలిసి కోరారు. సోమవారం ఆలూరు గ్రామ బీజేపీ నాయకులు కుమ్మరి కృష్ణ, మధుమోహన్‌రెడ్డి, కమ్మరి మోహన్, మురళీధర్‌రావు, యాదగిరి, మాణిక్య, కృష్ణ వారి కార్యాలయాలకు వెళ్లి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆలూరులో 12వేల జనాభా ఉందని, 6 వేల ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఆలూరు మండలం ఏర్పాటుకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని చుట్టూ ఉన్న అంతారం, తలారం, తంగడపల్లి, దుద్దాగు, దేవరంపల్లి, గణాపూర్, ఖానాపూర్, మడికట్లు నౌలాయపల్లి, మిర్జాగూడ, హస్తేపూర్ గ్రామాలను కలిపి మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ఆర్అండ్‌బీ ఎస్ఈ మోహన్ నాయక్‌కు వినతిపత్రం అందించి మాట్లాడుతూ... ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న ఆలూరు గేట్ నుంచి దుద్దాగు గేట్ వరకు అసంపూర్తిగా ఉన్న బీటీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల సమస్యలను తీర్చాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు సానుకులంగా స్పందించి పరిశీలిస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు

శంకర్‌పల్లి: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ డా.అనితారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గోపులారం మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా సంగారెడ్డికి చెందిన ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాల వారు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం పొడువు శ్రీనివాస్ సుమారు 300ల మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. భవిష్యత్తులోనూ మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

పేదలకు ఎంతో మేలు

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలతో ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నగరంలోని ఏబీజీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జనరల్ చెకప్‌తో పాటు పలు వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నాగేశ్వర్‌రెడ్డి, ఆనంద్ కులకర్ణి, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు



మొయినాబాద్‌రూరల్: శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

ప్రభుత్వ నిర్లక్ష్యానికి కార్మికుడి బలి

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: ప్రభుత్వ నిర్లక్ష్యానికి పారిశుద్ధ్య కార్మికుడి నిండు ప్రాణం బలైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి జైపాల్ యాదవ్ అన్నారు. ములుగు పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ.. ఐదు నెలలుగా జీతం అందక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న మహేశ్ చిత్రపటానికి కార్మికులతో కలిసి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సకాలంలో వేతనం అందక కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, వెంకటేశ్, నర్సింహ, అంజి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలని అభ్యర్థన

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ నుంచి మంఖాల్ వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని బీజేపీ రాష్ట్ర మీడియా కన్వీనర్ వీ.సుధాకర్‌శర్మ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీశైలం జాతీయ రహదారి, శ్రీనగర్ నుంచి మంఖాల్‌కు వెళ్లే రోడ్డు గత కొన్నేళ్ల నుంచి మరమ్మతులు నోచుకోకపోవడంతో పూర్తిగా అధ్వానంగా మారిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్మశాన వాటిక భూమిని కాపాడాలని వినతి

తుర్కయంజాల్: తొర్రూర్ రెవెన్యూ బ్రాహ్మణపల్లి సర్వే నంబర్ 191లోని శ్మశాన వాటిక భూమి కబ్జాకు గురవుతుందని, ఆ భూమిని గుర్తించి ప్రహరి నిర్మించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవ రెడ్డి కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా కొహెడలోని సురవరం సుధాకర్ రెడ్డి కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రూ.5 లక్షల నిధులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు చల్లా నారాయణ రెడ్డి, నాయకులు బాలయ్య, నరేందర్ గౌడ్, జగన్ మోహన్ రెడ్డి, అంజమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ

కొందుర్గు: మండలంలోని ఉమ్మెంత్యాల గ్రామంలో సోమవారం నాయకులు లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం పేద ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పేదలందరికీ కార్డులు పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉమ్మెంత్యాలలో 14 మందికి కొత్త రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, లక్ష్మయ్య, మల్లేశ్, పాండు, అంజయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, సాయికుమార్, వీరేశ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్



ముచ్చర్ల రహదారిని పరిశీలిస్తున్న నాయకులు

కందుకూరు: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే సబితారెడ్డి కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముచ్చర్ల నుంచి ఊట్లపల్లి మధ్యలో ఉన్న రహదారిని స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే కృషితో ఆ రహదారి నిర్మాణానికి రూ.2.72 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలను పక్కను పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేదంర్‌రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, బండ నర్సింహ, పి.అశోక్, కంద పెద్దనర్సింహ, సదానంద్‌గౌడ్, మోహన్, నీలం రామకృష్ణ, మల్లేశ్, రాజు, బొర్ర రాజు, చెన్నారెడ్డి, ఆనంద్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడి లడ్డూను రూ.70,200లకు దక్కించుకున్న వెంకటేశ్వరరావు

లడ్డూ @70 వేలు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి అనురాగ్‌నగర్ కాలనీ గణనాథుడి లడ్డూను వేలం పాటలో వై.వెంకటేశ్వరరావు రూ.70వేల 200లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మాదరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మహేందర్, సభ్యులు ఎస్.శివశంకర్, జే.వెంకటేశ్, రామకృష్ణ, ఉదయ్‌కుమార్, రాహుల్, నితిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ ధ్రువతార ఐలమ్మ

- ఆమె పోరాటం స్ఫూర్తిదాయకం
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కడ్తాల్: తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పాత్ర మరువలేనిదని, ఆమె ధైర్య సాహసాలు ఎందరికో స్ఫూర్తి దాయకమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధి రావిచేడ్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన ఐలమ్మ విగ్రహాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన మహనీయుల్లో వీరవనిత ఐలమ్మ ఒకరని గుర్తుచేశారు. అలాంటి వారిని నిత్యం పూజించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ధీరవనిత అన్నారు. తెలంగాణ ప్రజల తెగువను, పోరాట పటిమను, స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన విప్లవ ధ్రువతార అని కొనియాడారు. కార్యక్రమంలో రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, సంఘం గ్రామ అధ్యక్షుడు రవికుమార్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశగుప్తా, సంఘం నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కుసుమమాధురి



యాచారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధారాణి

- రాజకీయ పక్షాలు సహకరించాలి
- ఓటరు జాబితాల అభ్యంతరాలను స్వీకరిస్తాం
- ఎంపీడీఓలు కుసుమమాధురి, రాధారాణి

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగానే ఉన్నామని, అందుకు రాజకీయ పక్షాల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ కుసుమమాధురి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాలపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని గ్రామాల్లో జాబితాలను ప్రదర్శనకు పెట్టామని, వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. సలహాలు, సూచనలు పాటిస్తామని పేర్కొన్నారు.

యాచారంలో..

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వ ఆదేశాలు రావడమే ఆలస్యమని ఎంపీడీఓ రాధారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలకు సంబంధించి ఓటరు, పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై రాజకీయ పక్షాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాల గురించి మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, నాయకులు విజయనాయక్, తాండ్ర రవీందర్, మస్కు నర్సింహ, గౌర నర్సింహ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతనే సంఘం అభివృద్ధి



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

కడ్తాల్: గౌడ సంఘం అభివృద్ధి, కులస్తుల సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా కృషి చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మాలే మల్లేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు యాదయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో.. మండల అధ్యక్షుడు మల్లేశ్ సమక్షంలో గౌడ పట్టణ యువజన సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివగౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, శేఖర్, మహేశ్, ప్రధాన కార్యదర్శులుగా అనిల్, శ్రీను, నరేశ్, జగదీశ్, కార్యదర్శులుగా చిన్నా, సందీప్, సంయుక్త కార్యదర్శులుగా మహేందర్, శివ, కోశాధికారిగా కార్తీక్, సహాయ కార్యదర్శులుగా నాగులు, హరీశ్, కార్యవర్గ సభ్యులుగా కార్తీక్, మల్లేశ్, రాజశేఖర్, అంజయ్యను నియమించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాదయ్యగౌడ్, వెంకటయ్య, గణేశ్, కేశవులు, శ్రీరాములు, శ్రీనివాస్, యాదయ్య, అంజయ్య, జగదీశ్ తదితరులు ఉన్నారు.